క్లుప్తంగా

సైన్స్ కాంగ్రెస్‌కు విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఉయ్యాలవాడ : రాష్ట్ర స్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు స్థానిక మోడల్‌స్కూల్ విద్యార్థి బుడ్డా నాగ నితీష్‌రెడ్డి ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు నాగ వైష్ణవి పర్యవేక్షణలో దేశీయ మందులతో షుగర్‌ను ఎలా నివారించాలి అనే అంశంపై నంద్యాలలో జరిగిన జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపడంతో ప్రాజెక్టును రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారని చెప్పారు. అనంతరం విద్యార్థిని అధ్యాపకులతో కలిసి అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

శిరివెళ్ల: మండలంలో వీరారెడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణలత బుధవారం తెలిపారు. పోస్టును ఈడబ్ల్యూఎస్ కేటగిరి వారికి కేటాయించామన్నారు. 10వ తరగతి, ఆపై చదివిన, వివాహితులు, స్థానికంగా నివాసం ఉంటున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 1-7-2023 నాటికి 21 - 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు అర్హులని, దివ్యాంగులైతే ధ్రువ పత్రం, వితంతువుయితే భర్త మరణ ధ్రువ పత్రాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. అర్హత గల వారు స్టడీ, ఆదాయం, కులం, స్థానిక, జనన ధ్రువ పత్రాలతో పూర్తి చేసిన దరఖాస్తును ఈ నెల 3 నుంచి 11వ తేదీ లోపు ఆళ్లగడ్డ ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): ఐసీడీఎస్ నంద్యాల అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయాల పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థినుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు సీడీపీఓ చంద్రకళ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని విశ్వాసపురం(ఓసీ), సరస్వతి నగర్ (ఎస్టీ), మంచాలకట్ట-1(ఈడబ్ల్యూఎస్) పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు 01-07-2023 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 ఏళ్ల లోపు వయస్సు, పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. పోస్టుల ఎంపికలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించబడుతుందని, స్థానికంగా నివాసం ఉంటూ వివాహితులై ఉండాలని పేర్కొన్నారు. గురువారం నుంచి ఈ నెల 11వ తేదీ లోపు దరఖాస్తులు సంబంధిత సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఓటరు జాబితా విడుదల

శిరివెళ్ల: ఓటర్ల ముసాయిదా జాబితా విడుదలైందని తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ బుధవారం తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో ఓటర్ల జాబితా సవరణ జరిగిందన్నారు. చేర్పులు, మార్పుల అనంతరం మండలంలో 45,784 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అందులో మహిళా ఓటర్లు 22,984 మంది కాగా పురుషులు 22,796 మంది ఓటర్లున్నారన్నారు. నలుగురు ట్రాన్స్‌జెండర్ ఓటర్లున్నారన్నారు. ఓటర్ల జాబితాలు ఆయా గ్రామాల పోలింగ్ బూతు లెవెల్ అఫీసర్ల వదంద అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జాబితాలో తమ పేరు లేక పోతే ఫారం-6 పూర్తి చేసి అధికారులకు అందచేయాలని సూచించారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ మహిళా సమైఖ్య 15వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మహిళా సమైఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సుగుణమ్మ కోరారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 17,18,19 తేదీల్లో నంద్యాలలో జరిగే మహాసభలకు మహిళలు తరలిరావాలని పిలుపునిచ్చారు. 17న మహిళలతో పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తామని చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, రజితమ్మ, షేక్ మున్ని, సోమేశ్వరి, శిరీష పాల్గొన్నారు.

తోటల సాగుకు ప్రోత్సాహం

గోస్పాడు: హార్టికల్చర్ పంటల సాగుకు ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తుందని ఏపీడీ బాలాజీ, ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం తోటలు సాగు చేసిన రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శానిటేషన్ సూపర్‌వైజర్ వెంకటసుబ్బయ్య, కోర్స్ డైరెక్టర్ ఇస్మాయిల్ రైతులకు శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ సబ్సిడీపై 19 రకాల తోటలను రైతులు సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. మండలంలో సాగైన కొబ్బరి, నిమ్మ, బత్తాయి తదితర తోటల సాగుకు రైతులు అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. ఏపీఓ నాగజ్యోతి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): మండలంలోని చాపిరేవుల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 60 మంది పేద విద్యార్థులకు బుధవారం పూర్వవిద్యార్థులు,ఉపాధ్యాయులు భానుప్రకాశ్, అరుణ దీపక్‌ల సహకారంతో నోట్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కేవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ అలాగే పదవ తరగతిలో ప్రథమ స్థానంలో ఉన్న వైష్ణవి, అర్చనకు రూ. వెయ్యి ఆర్థిక సాయం చేశారని చెప్పారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

- స్మోక్ ఫ్రీ జోన్లుగా విద్యాలయాలు
- ఆరు నెలలకొకసారి టొబాకో నిర్మూలనపై విద్యార్థులతో చర్చ
- స్కూల్ ఆవరణలో పొగ నిషేధిత బోర్డులు
- మార్గదర్శకాలను విడుదల చేసిన ప్రభుత్వం

నాడు-నేడు ద్వారా బడుల్లో అన్ని రకాల వసతులు కల్పించి అభివృద్ధి చేసిన ప్రభుత్వం.. విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా చర్యలు చేపట్టింది. ఇందుకు విద్యా నిలయాలను స్మోక్ ఫ్రీ జోన్‌లుగా ప్రకటించింది. పాఠశాలల పరిసరాల్లో బీడీ, సిగరెట్, గుట్కా వంటి వాసన ఉండరాదని, వారికి చిన్నతనం నుంచి ధూమపానం గురించి తెలియకుండా చేసేందుకు ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. దీంతో విద్యాశాఖ వాటి అమలుకు చర్యలు ముమ్మరం చేసింది.





చాపిరేవుల పాఠశాలలో పొగాకు నిర్మూలించాలంటూ నినాదాలు చేస్తున్న విద్యార్థులు (ఫైల్), పొగాకుపై నోటీసు బోర్డు చూపుతున్న విద్యార్థులు (ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): బడులను రూపుదిద్దిన ప్రభుత్వం ప్రస్తుతం పరిసరాలను కూడా ఆహ్లాదకరంగా, చిన్నారులు ఆరోగ్యంగా ఉండేలా చూడటమే ధ్యేయంగా అడుగులు వేస్తోంది. స్కూళ్లు పరిశుభ్రంగా ఉండడమే కాదు.. పరిసరాల్లో సిగరెట్, బీడీ, చుట్ట, గుట్కా వంటి వాసన కూడా ఉండకూడదు. పాఠశాల పరిసరాలు ఆహ్లాదకంగా ఉండాలి. చిన్నతనం నుండే పొగ ప్రభావానికి లోనుకాకుండా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలను స్మోక్ ఫ్రీ జోన్లుగా తయారు చేయాలని సంకల్పించింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మార్గ దర్శకాలకు అనుగుణంగా రాష్ట్రంలో కూడా పాఠశాలలను కాపాడేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు సాగుతోంది. దీంతో జిల్లాలోని పాఠశాలలను స్మోక్ ఫ్రీ జోన్లుగా మార్చేందుకు విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది.

స్మోక్ ఫ్రీ జోన్లుగా సరస్వతీ నిలయాలు..

నంద్యాల జిల్లాలోని విద్యాలయాలను స్మోక్ ఫ్రీ జోన్లుగా మార్చేందుకు విద్యాశాఖ నిబంధనలను కఠినతరం చేసింది. ప్రస్తుతం జిల్లాలో ఉన్న 1,409 సర్కారు బడుల్లో చదువుతున్న 1,54,561 మంది విద్యార్థులను పొగ బారి నుంచి కాపాడేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పాఠశాలలకు వస్తున్న విద్యార్థులకు పొగ వాసన రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు.

నిబంధనలు ఇలా..

- పొగ తాగేవారే కాదు పొగ ఆనవాళ్లు కూడా స్కూళ్ల పరిసరాల్లో కనిపించరాదు. ఉపాధ్యాయులు, వాహన డ్రైవర్లు పొగ తాగినా నేరమే.
- ప్రతి పాఠశాలలో ముఖద్వారం వద్ద, లోపల గోడలపైన 'టొబాకో లేని స్కూలు' అని బోర్డులు రాయించాలి. స్కూల్ ప్రహరీకి వంద గజాల పరిధిలో బీడీ, సిగరెట్లు, గుట్కాలు అమ్మే దుకాణాలు ఉండరాదు.
- పొగతో కలిగే హాని ఎలాంటిదో తెలిపే స్టిక్కర్లు గోడలపై ఏర్పాటు చేయాలి.
- స్కూల్ ఆవరణలో ఎవరైనా పొగ తాగితే వారిపై చర్యతీసుకునే అధికారి పేరు, హోదా, ఫోన్ నంబరు గోడలపై రాయాలి.
- ఆరు నెలలకోసారి టొబాకో నిర్మూలనపై విద్యార్థులతో ఉపాధ్యాయులు చర్చించాలి. ఎవరైనా పొగ తాగితే వారిపై తీసుకోవాల్సిన చర్యలను విద్యార్థులకు తెలియజేయాలి.



చాపిరేవుల జెడ్పీ స్కూల్‌లో పొగాకు వల్ల కలిగే నష్టాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న స్టాఫ్‌నర్సు

పొగతాగితే చర్యలు తీసుకుంటాం



పాఠశాల ఆవరణలో ఎవరైనా పొగతాగితే చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. ధూమపానం, గుట్కా, పొగాకు వంటి వాటికి దూరంగా ఉండాలి. – కేవీ సుబ్బారెడ్డి, టొబాకో నోడల్ ఆఫీసర్, నంద్యాల

నిబంధనలు అమలు చేయాలి



ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా అన్ని పాఠశాలల్లో అమలయ్యేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి. స్మోక్ ఫ్రీ జోన్లుగా పాఠశాలలను ఉంచుతామని ప్రతిజ్ఞ చేయాలి. ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించి, తల్లిదండ్రులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సిబ్బందికి అవగాహన కల్పించాలి.
–సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీపీ వీరభద్రుడు

చాగలమర్రి: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు వ్యవహరించాలని, సీఎం జగనన్నను ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ వీరభద్రుడు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓ మహబూబ్ దౌలా ఆధ్వర్యంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. వైద్య ఆరోగ్య సేవలపై వైద్యాధికారి షేక్ ఇమ్రాన్ మాట్లాడుతూ ప్రభుత్వం గత నెలలో నిర్వహించిన 16 జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాల్లో సుమారు 6,530 మందికి వైద్య సేవలు అందాయన్నారు. అలాగే 2,580 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, వారికి త్వరలోనే కంటి అద్దాలు ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేస్తామన్నారు. శిబిరాల్లో 238 మందికి అద్దాలు అందజేశామన్నారు. సాధారణ కాన్పుల నిర్వహణలో చాగలమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 5వ స్థానంలో ఉందన్నారు. ఉపాధి హామీ పథకంపై సమీక్ష నిర్వహిస్తుండగా, మండలంలో పనుల్లో పలు అక్రమాలు జరుగుతున్నాయని కో-ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం ఆరోపించారు. విద్యుత్ ఏఈ షాజహాన్ మాట్లాడుతూ మండలంలో కొత్తగా 90 విద్యుత్ స్తంభాలు మంజూరు చేశారని, వాటి వినియోగానికి ప్రతిపాదనలు ఇస్తే వెంటనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమావేశానికి కేసీ కెనాల్, తెలుగంగ, ఆర్టీసీ అధికారులు గైర్హజరు కావడంపై ఎంపీపీ, ఎంపీడీఓ మండి మండిపడ్డారు. తహసీల్దార్ సుభద్రమ్మ మాట్లాడుతూ మండలంలో 16,009 రేషన్ కార్డులుండగా వాటిలో 1,206 కొత్త కార్డులున్నాయన్నారు. ఎంపీటీసీలు, ఈఓపీఆర్‌డి సుదర్శనరావుర్శేపీఎం నాగమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య, పీఆర్ ఏఈ కొండారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని పాదయాత్ర



అల్లూరు గ్రామానికి చేరుకున్న ఎంపీపీ శేఖర్ యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఉయ్యాలవాడ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల్లో మళ్లీ సీఎం కావాలని ప్రొద్దుటూరు మండల అధ్యక్షుడు శేఖర్ యాదవ్ చేపట్టిన పాదయాత్ర బుధవారం ఉయ్యాలవాడ మండలం చేరుకుంది. వైఎస్సార్ కడప జిల్లా నుంచి జిల్లాలోని బనగానపల్లె నియోజకవర్గంలోని నందవరంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరి దేవి ఆశీస్సుల కోసం పాదయాత్ర చేపట్టినట్లు ఎంపీపీ పేర్కొన్నారు. మండలంలోని గోవిందపల్లె, మాయలూరు, అల్లూరు గ్రామానికి యాత్ర చేరుకోవడంతో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు రేనాటి నరసింహారెడ్డి, ఆరికట్ల శివారెడ్డి,శివరామకృష్ణారెడ్డి, యాదవ సంఘం నాయకులు దాసరి నాగేంద్ర, దాసరి విశ్వంతో పాటు పలువురు కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. మాయలూరులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే అల్లూరులో ఎంపీపీని స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు.

ఈ-టాయిలెట్స్ స్థలంలో షాపులు నిర్మించొద్దు



ఈ-టాయిలెట్స్ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేయవద్దని ధర్నా చేస్తున్న వ్యాపారులు

శ్రీశైలం: ఈ-టాయిలెట్స్ స్థలంలో కొత్తషాపులను నిర్మించొద్దని లలితాబజార్‌లోని వ్యాపారులు ఆందోళనకు దిగారు. శ్రీశైలదేవస్థానం పరిధిలోని లలితాబజార్‌లోని జె, కె, ఎల్ కాంప్లెక్స్ మధ్యలో నిర్మించిన ఈ-టాయిలెట్స్ తొలగింపు పనులు బుధవారం ప్రారంభించడంతో వ్యాపారులు ఆ స్థలంలో కొత్తషాపులను నిర్మిస్తారనే ఉద్దేశంతో ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న దేవస్థానం రెవెన్యూ సహాయ కార్యనిర్వాహణాధికారి ఫణీధర ప్రసాద్, రెవెన్యూ సిబ్బందితో కలిసి షాపింగ్ కాంప్లెక్స్ వద్దకు చేరుకున్నారు. దేవస్థానం పరువు ప్రతిష్టలు బజారుకీడ్చకుండా ఆఫీస్‌లో సమావేశమవుదామని నచ్చజెప్పారు. దీంతో దేవస్థానం ఆఫీస్‌లో ఏఈఓ, ఈఈ రామకృష్ణలు వ్యాపారస్తులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం ఉన్న ఈ-టాయిలెట్స్‌ను భక్తుల అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని తొలగిస్తున్నామని, వాటిని వేరే చోట ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. దీంతో వ్యాపారస్తులు ఈ-టాయిలెట్స్, చెట్లను తొలగించాక ఆ ప్రదేశంలో తిరిగి షాపుల నిర్మాణం చేయబోమని హామీ ఇవ్వాల్సిందిగా దేవస్థానం అధికారులను కోరారు. ఈ విషయంపై ఈఓ తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

క్రైం కార్నర్

పేకాట రాయుళ్ల అరెస్టు

పాములపాడు: తుమ్మలూరు గ్రామానికి చెందిన ముగ్గురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ అశోక్ బుధవారం రాత్రి తెలిపారు. గ్రామానికి చెందిన బోయ దర్గయ్య, బోయ వెంకటశివుడు, తెలుగు అశోక్ గ్రామ శివారులో పేకాట ఆడున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ సిబ్బందితో వెళ్లి దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,240 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

నల్లమల ఘాట్‌లో తప్పిన ముప్పు

మహానంది: నంద్యాల, ప్రకాశం జిల్లాల సరిహద్దులను కలుపుతూ ఉన్న నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో బస్సు, లారీ ఢీకొన్న సంఘటనలో పెద్ద ప్రమాదం తప్పింది. గాజులపల్లె నుంచి గిద్దలూరు వెళ్లే మార్గంలోని చింతమాను టర్నింగ్ మలుపుల వద్ద ఎదురెదురుగా వస్తున్న ప్రైవేటు బస్సు, లారీ ఢీకొన్నాయి. ఈ సంఘటనలో అదృష్టవశాత్తు ఎవరికి ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. రెండు వాహనాల ముందు భాగాలు దెబ్బతిన్నాయి.

13 మందిపై బైండోవర్ కేసులు

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం, బసవాపురం, బుక్కాపురం గ్రామాలకు చెందిన 13 మందిపై బుధవారం బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు, గతంలో అల్లర్లకు పాల్పడిన వారిపై నిఘా ఉంచామన్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

మూడు టిప్పర్లు సీజ్

జూపాడుబంగ్లా: ఎలాంటి భద్రత, సరైన పత్రాల్లేకుండా అధికలోడుతో ఇసుకను తరలిస్తున్న మూడు టిప్పర్లను ఎస్‌ఐ మారుతిశంకర్ సీజ్ చేశారు. గురువారం కర్నూలు నుంచి ఆత్మకూరు వైపు వెళ్తున్న మూడు టిప్పర్లును ఎస్‌ఐ గమనించారు. పత్రాలను పరిశీలించగా సక్రమంగా లేకపోవడంతో వెంటనే స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

సంజామల: ఆల్వకొండ గ్రామనికి చెందిన ఓ విద్యార్థిని ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కాంచుగారి మహబూబ్ ఉశేన్ , షమీమున్ దంపతుల పెద్ద కుమార్తె కాంచుగారి కౌసర్ జాహా(14) మంగళవారం ఆత్మహత్య పాల్పడింది. కౌసర్ జాహా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుంది. తల్లితండ్రులు బాగా చదువుకోలని మందలించడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పార్టీలకు అతీతంగా పథకాల అందజేత

నంద్యాల(సిటీ): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు చెప్పిన వారికే అందేవని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. బుధవారం పట్టణంలోని 13, 27, 34వ వార్డుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పథకాల గురించి వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలును చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారంతో పబ్బం గడుపుతున్నారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, 13వ వార్డు కౌన్సిలర్ కాల్వ సరస్వతి, 34వ వార్డు ఇన్‌చార్జ్ జాకీర్‌హుసేన్, కో ఆప్షన్ సభ్యులు శోభారాణి, 27వ వార్డు ఇన్‌చార్జ్ దేవనగర్‌బాషా, కౌన్సిలర్లు కలాంబాషా, సాదిక్, విజభాస్కర్, టౌలర్‌శివ పాల్గొన్నారు.



మహిళకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి



పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్

పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకోవాలి

అమరజీవి పొట్టిశ్రీరాములును యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సంజీవనగర్ గేట్‌లో ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పా రవి మాట్లాడుతూ తెలుగు భాష మాట్లాడే వారిని ఏకతాటిపైకి తెచ్చి వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన అమరజీవి ఆదర్శనీయుడన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మిగణపతి స్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద వెలసిన లక్ష్మి గణపతి దేవస్థానంలో బుధవారం సంకటహర చతుర్థి సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి పంచామృత అభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ అనంతరం ప్రత్యేకంగా అలంకరించి గరికతో అష్టోత్తర శతనామావలి చేపట్టారు. తదనంతరం నవగ్రహ హోమం, గణపతి హోమం జరిపించి పూర్ణాహుతి గావించారు.

8న విద్యాసంస్థల బంద్

నంద్యాల(న్యూటౌన్): కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం ఈ నెల 8వ తేదీన విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు రాంబాబు, నాగరాముడు, ధనుంజయుడు, రఫి, నిరంజన్, శివ, నాగార్జున తెలిపారు. బుధవారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాజకీయ లబ్ధికోసం కార్పొరేట్ వ్యక్తులకు కొమ్ముకాస్తూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానలపై పోరాటం చేసేందుకు విద్యార్థి సంఘాలన్నీ ఐక్యంగా ఉండాలన్నారు. బాలాజీ, వినయ్, సాయి, హరి, రవితేజ, కిరణ్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

దొర్నిపాడు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టరును దొర్నిపాడు పోలీసులు బుధవారం సీజ్ చేశారు. పెద్దముడియం గ్రామానికి చెందిన ఓబులేసు అనే వ్యక్తి జమ్మలమడుగు నుంచి చాకరాజువేములకు ఇసుకను తరలిస్తున్నాడనే సమచారం మేరకు పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. ఇసుక తరలింపునకు ఎంలాంటి ధ్రువ పత్రాలు, అనుమతి లేకపోవడంతో కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తిరుపాల్ పేర్కొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

వెలుగోడు: ఖరీఫ్‌లో పంటలకు ఆయకట్టు రైతులు వారాబందీ పద్ధతిలో నీటిని పొదుపుగా వాడుకోవాలని తెలుగు గంగ ఈఈ వెంకటేశ్వర్లు శెట్టి సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..వర్షాభావ పరిస్థితుల కారణంగా శ్రీశైలం జలాశయానికి నీరు పూర్తి స్థాయిలో చేరలేదని, రాయలసీమలోని జలాశయాలకు కావలసిన సరఫరా కాలేదన్నారు.

పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శనీయం



నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

నంద్యాల(వ్యవసాయం): ఆంధ్రరాష్ట్ర ఆవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం అందరికీ ఆదర్శనీయమని ఉమ్మడి జిల్లాల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బింగుమళ్ల శ్యామ్ సుందర్ గుప్త అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్ ఖండే శ్యాంసుందర్ లాల్‌లతో కలిసి స్థానిక సంజీవనగర్ కూడలిలోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు జేవీసీ ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి మలిపెద్ది నాగరాజు, కోశాధికారి రామకృష్ణ, కార్యదర్శులు శివశంకర్, సుబ్బారావు, జిల్లా కార్యదర్శి జనార్దన్, సభ్యులు రవి ప్రకాష్, సముద్రాల కుమార్, సతీష్ పాల్గొన్నారు.

దొర్నిపాడు: ఆంధ్ర రాష్ట్ర కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టిశ్రీరాములు వంటి మహనీయులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని తహసీల్దార్ జయప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పొట్టిశ్రీరాముల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ రాష్ట్రడైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, వీఆర్‌ఓలు సాంబశివుడు, సావిత్రి, రాధమ్మ, నాగేష్ పాల్గొన్నారు.

నంద్యాల(సిటీ): ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రవిచంద్రారెడ్డి అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు భాష మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని నిరాహార దీక్ష చేసి సాధించారన్నారు. ఈ క్రమంలో తన ప్రాణాలను అర్పించి త్యాగధనుడిగా మిగిలారని కొనియాడారు. అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి, ఎంహెచ్ఓ డాక్టర్ అంకిరెడ్డి పాల్గొన్నారు.



నంద్యాలలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



దొర్నిపాడులో నివాళులర్పిస్తున్న తహసీల్దార్ జయప్రసాద్

సాక్షిగణపతికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్ర స్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలతోనూ, ఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలావీరభద్రస్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆనందమని పింఛన్



నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓబులేసుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్



సుజానమ్మ, కమలమ్మలకు వేకువజామునే పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ సాలు పుల్లమ్మ



మిట్నాలలో వెంకటమ్మకు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ పుల్లయ్య

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో తెల్లవారక ముందు పింఛన్ల పంపిణీ బుధవారం మొదలైంది. నంద్యాల జిల్లాలోని 2,22,277మంది పింఛన్ దారులకు రూ.61.38 కోట్లు నగదును ప్రభుత్వం మంజూరు చేసిందని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో మొదటి రోజు 1,13,140 లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశామని, ఇప్పటికే 70శాతం పంపిణీ పూర్తయిందన్నారు.

దొర్నిపాడు: మండలంలో పింఛన్ల పంపిణీని గ్రామ వలంటీర్లు బుధవారం కోడికూయక ముందే పంపిణీ ప్రారంభించారు. మొత్తం 3,756 పింఛన్లకు గాను రూ.1,03,33,500 విడుదలైందని ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు. తొలిరోజు 90 శాతం పంపిణీ పూర్తయ్యిందని చెప్పారు.